# ఇది నా తప్పు కాదు భాయి

వెల్చేరు చంద్రశేఖర్

**"ఏమండోయ్! కాకి అరుస్తోంది. అన్నయ్య వస్తాడేమో? అంది శ్యామల. వాళ్ళ అన్నయ్య రాడని నాకు బాగా తెలుసు. కాని అలా అనలేదు, ఉడుక్కుంటుంది.**

**ఎందుకంటె ఈ రోజు శ్యామల ప్రసన్నంగా ఉండడం ఎంతైనా అవసరం.**

వాళ్ళన్నయ్య రాడు కాని, ఎవరొస్తారో నాకు బాగా తెలుసు.

కాకి అబద్ధం చెప్పదు కదా!

పేకాట బోర్డు మెంబర్లు వస్తారన్న మాట.

వాళ్ళు వస్తారని చెప్పి, శ్యామల దగ్గర అప్రోజిషను భరించే కన్నా.........

వాళ్ళు వచ్చాక ఏదో, కాజువల్‌గా ఆడక తప్పద న్నట్టు మొహం పెట్టి, పేకాట ఆడాలి. ముందుగా శ్యామలకి తెలిస్తే అమంగళం తప్పదు. శ్యామల డిఫెన్స్ కూడా చాల దారుణంగా వుంటుంది. అంతవరకూ పక్క మీద, సోఫామీద ఉన్న దుప్పట్లు, కవర్లు ఒక్కసారి కనబడవు. ఈ విషయంలో శ్యామల్ని నిందించనక్కరలేదు. ఎందుకంటే......... ఈ బాధ్యత అంతా రెడ్డిదే!

రెడ్డి ఎప్పుడు వచ్చినా...... పేంటు, షర్టు విప్పి పర్సు పట్టుకు పేకాట రంగంలోకి దిగడం అలవాటు...... ఆ అలవాటు బాగానే వుంది కాని, లోపల ఎలాస్టిక్ కట్ డ్రాయరు బోర్డు మెంబర్లని ఆకర్షించకుండా (అంటే బాధ పెట్టకుండా) తాత్కాలికంగా, అక్కడ ఉన్న డోర్ కర్టెనో, సోఫా కవరో, లుంగీలా ఉపయో గించుకునేవాడు. నాకు తెలిసున్నంతవరకూ, ఆ డోరు కర్టెనుతోనే ఇంటికెళ్ళే అవసరం అతనికి రాలేదు.

ఆట సాగుతూంటే అధిక శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చేవి సిగరెట్లు, కాఫీలు వగైరా వగైరా......... కాఫీలు అంటె జ్ఞాపకం వచ్చేది శర్మ గారిల్లే. ఆయన ఇంట్లో ఎప్పుడు పేకాట వేసినా, ఆ మహా ఇల్లాలు, కాఫీలో, టీలో సప్లై చెయ్యడం కద్దు. అంటే ఆవిడ "స్వీట్ హోం" నవల చదవలేదని కాదు. చదివినా, ఇద్దరు పిల్లలు, మార్పురాని ఇంటాయనతో యుద్ధం చేసి చేసి అలసి పోయుం డచ్చు......

ఇంకా మా సంసారం అలసిపోయే స్థితికి రాలేదు. అంచేత శ్యామలతో ఇవాళ పేకాట ఉంది అని చెపితే, ఉన్న పాలన్నీ గుంట ముండ చేత ( మా అమ్మాయి లెండి) బలవంతాన తాగించేస్తుంది.

ఇంక మనం కాఫీకో, చాయ్‌కో అప్పీలు చెయ్యనఖర లేదు.

చాయ్ లేకపోతే బాలకృష్ణ ఊరుకోడు, "శర్మ గారింటికి పోయినా బావుండును. టీ యేనా ఇచ్చే వారు" అంటాడు.

అసలు బాలకృష్ణ ఎలాంటి వాడంటే ఇటు ఆటలు కొడుతుంటాడు, అటు బోర్డు మెంబర్లని మాటలతోను కొడుతుంటాడు.

ఈయనకి దేవ భాష బాగా వచ్చు. ప్రతి వాక్యానికి ఎవర ఏదో ఒక అలంకారం (బూతుది) ఉంటుంది. ఆ అలంకారం నిత్య నూతనంగా వుంటుంది.

బాలకృష్ణ ఎ.సి. (ఆల్ కవుంట్)లో ఉండి ముక్కలు రాకపోతే, బోర్డు మెంబర్లని విశాఖపట్నం వీధి కొళాయి స్థితికి దిగజార్చేస్తాడు.

బాలకృష్ణ అన్నా శ్యామలకి భయమే! "బాలకృష్ణ వస్తున్నారా?" అని అడుగుతుంది. అవునంటే చెవుల్లో దూదులు పెట్టుకుంటుంది. బాలకృష్ణుడి మాటలు



అంత ముద్దొస్తాయి.

ఇదే కేటగిరీకి చెందిన మరో ఇద్దరు ఉన్నారు.

ఇద్దరూ బావల వరసే. (ఒకరి కొకరు)

ఒకరు గోపి. పేరు ఎవరు పెట్టారో కాని అచ్చు గోడ మీది పిల్లే. ఈయన లెక్కల్లో దిట్ట. అన్ని రకాల లెక్కల్లో ఒక్క దాంట్లో మాత్రం చాల వీక్ — స్వంత ఒకులు లెక్కపెట్టడంలో!

ఒక పాయింట్‌తో రూపాయి మిగులుతుంది అంటే ఆ లెక్క తప్పేదన్నమాటే. దానికి ముద్దుగా వాళ్ళు పెట్టే పేరు "ఓకే బాడ్"

"ఓకే బాడ్" థియరీ కనుక్కొన్న వాడు అస్క్ (**asgk**). ఇద్దరూ ఆట కొట్టినా కష్టమే! కొట్టక పోయినా కష్టమే! ఎందుకంటె ఇద్దరూ ఒకేసారి ఆట కొట్టడం ఇంపాజిబుల్ కాబట్టి.

ఎవరో ఒకరు ఓడిపోవడం తప్పదు. గెలిచిన వాడు కార్డు ఎలా వచ్చాయో, ఎలా ఆట కొట్టాడో చెబు తుంటే...... ఓడిపోయిన వాడు గెలిచిన వాడు ఆట ఎందుకు కొట్టాడో ఎనాలిసిస్ మొదలు పెడతాడు.

ఎనాలిసిస్ (కారణాలు) అంటె వాడు కాలి మీద ఒంటేలికి పోసుకున్నాడని, ఏదో తొక్కి వచ్చాడని వగైరా వగైరా...... ఒక వేళ వాడికి సమయానికి ఒంటేలికి రాకపోతే పక్క ఆటగాడ్ని తీసికెళ్ళి ఆ పని పూర్తి చేయించుకున్నాడని అనడం కద్దు.

ఎంత వరకూ నిజం అన్నది మనకి తెలియదు అనుకోండి.

కాని ఒకొక్కొప్పుడు నాకు వాళ్ళ మాటల్లో నిజం ఉందేమో అనిపిస్తుంది.

ఈ బావమరుదులు ఇలా ఏడిస్తే (వీళ్ళు ఏడవ డంలో ముక్కు తిమ్మన సత్యభామని పోలితే) మాకు భట్టుమూర్తి గారు కూడా ఒకాయన ఉన్నారు.

ఆయన అసలు పేరు పార్థసారథి.

పార్థసారథి రంగులో మాత్రమే కృష్ణుడి పోలిక ......... ఒక్కరై భార్య......... నాన్న ఎక్కడ పేకాట ఆడుతున్నా పసిగట్టి అమ్మకి చెప్పేసే ఒక కుర్ర రత్నం ఉన్నాడు.

ఆ కుర్ర రత్నం అమ్మకి చెప్పేక...... మన పార్థ సారథుల వారు ఏం చేసారు? అని బోర్డు మెంబర్లు ఇంతవరకూ చర్చించలేదు.

అయితే పార్థసారథి మాత్రం పేకాటకి రావడం మానలేదు.

పార్థసారథి స్వతంత్రంగా ఏం మాట్లాడడు, ఎవరు జోకు వేసినా తరతమ భేదం లేకుండా నవ్వగలడు.

కాని... అతని రియాక్షన్ అతని గెలుపు ఓటముల మీద ఆధారపడి ఉంటుంది. గెలుస్తుంటే నవ్వు తాడు......... ఓటమిలో విసుక్కోడం......... ఒక్కోసారి ఉడుక్కోడం కూడా... కద్దు.

వీళ్ళందరిలో పేకాటే పంచ ప్రాణాలుగా ఆడే చంద్ర ఒకడు. వీడు నవ్వడు, మాట్లాడడు, జోకు లెయ్యడు...... వీడికి పేకాటంటే ఆట...... వీడిని "జూద కపి" అనవచ్చు అప్పుడప్పుడు "మపి" కూడా.........

ఇన్ని బాధలు పడి పేకాట ఆడితే......... శ్యామ లమ్మ మూతి విరిచేస్తుంది (మొహంమీదే) కొంచెం తీవ్రంగానే విరిచేస్తుంది. చంద్ర లాసులోవుంటే......

చంద్రా విరుస్తాడు మూతి.

ఆ రోజు నుంచి...... ఉపోషాలు...... కాఫీలో పంచదార మర్చిపోవడాలు, కూరలో రెండు సార్లు ఉప్పు వెయ్యడం...... అన్నం అంటే ఘనద్రవవాయు స్థితుల్లో రకరకాలుగా వండడం ఆఫ్‌కోర్స్ వాయుస్థితిలో ఇంత వరకూ వండ లేదు అనుకోండి.

ఏది ఏమైనా......... ఈ ప్రొఫెషనల్స్‌ది—అంటే మాది — విషాద గాథే!......

ఏదో కళ చచ్చిపోకుండా పాటుపడుతున్నాము...... కళని బతికిస్తున్నాము. మహాకవి శలవిచ్చినట్లు,

" ఆ మహా మహా నలమహారాజుకే తప్పలేదు భాయి.

ఇది నా తప్పు కాదు భాయి"